శ్రీమతే రామానుజాయ నమః

శ్రీమద్వరవరమునయే నమః

అణ్ణాళ్ అనుగ్రహించిన

నాచ్చియార్ తిరుమొళి - సవ్యాఖ్యానం

పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన మణిప్రవాళ వ్యాఖ్యానమ్

ఆంధ్రానువాదంతో

ఆంధ్రానువాదం

'పండితరత్న' డా|| ఉ. వే. శ్రీమాన్ ఈయుణ్ణి అళగ శింగరాచార్యస్వామివారు

అణ్ణాళ్ అనుగ్రహించిన

నాచ్చియార్ తిరుమొళి – సవ్యాఖ్యానం

పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన మణిప్రవాళ వ్యాఖ్యానమ్ ఆంధ్రానువాదంతో

ఆంధ్రానువాదకులు : 'పండితరత్న' డా|| ఉ. వే. శ్రీమాన్

ఈయుణ్ణి అప్పగ శింగరాచార్యస్వామివారు

ప్రతులు : 1000

ప్రథమ ముద్రణం : మే, 2024

ఆవిష్కరణం : 18-5-2024

ముఖచిత్రం : **అణ్ణాళ్ రంగనాథుల కళ్యాణ ఘట్టం,**

శ్రీవిల్లిపుత్తూరు.

ఈ గ్రంథము, శ్రీ ఉ.వే. శ్రీమాన్ తూపురాణి ఉడయవర్లు స్వామివారి తిరునక్షత్రోత్సవ జ్ఞాపికగా శ్రీ శ్రీ శ్రీ రామచంద్ర జీయర్ స్వామివారు, ఉడయవర్లు స్వామి వారి శిష్యులు, ఆన్లైన్ తిరుమంత్రార్థ గోష్టి మరియు భాగవతోత్తముల సమర్పించిన పవిత్ర ద్రవ్యముతో ముద్రించబడినది.

ప్రాప్తిస్థానము

టి. పద్మ శ్రీనివాస్,
23 -24-54, బ్రహ్మయ్య పంతులు వీధి,
సత్యనారాయణపురం విజయవాడ – 11.
సెల్: 9440831495;

డి. టి. పి : శ్రీమాన్ వంగల కేశవ అయ్యంగార్

ప్రింటింగ్ : కర్షక్ ప్రింటర్స్, హైదరాబాదు

శ్రీమతే నారాయణాయ నమః

శ్రీమతే రామానుజాయ నమః

మంగళాశాసనం

శ్రీ వైష్ణవులైన భాగవతోత్తములకు అర్థపంచకజ్ఞానం, తత్త్వత్రయ జ్ఞానం అలానే రహస్యత్రయ జ్ఞానం అనేవి చాలా అవసరం. అలాంటి జ్ఞానాన్ని కలిగించి భగవంతునిపై భక్తిని పెంచే గ్రంథాలలో అగాధ భగవద్భక్తిలో అవగాహించిన ఆళ్వార్ల నాలాయిర దివ్యప్రబంధమే శిరోభూషణం.

ఆరావముదే! అన్నట్లుగా ఎప్పటికప్పుడే విలక్షణమైన భగవదనుభూతిని కలిగిస్తాయి ఈ దివ్యసూరుల దివ్యప్రబంధాలు. వాటిలో స్వభావతః భగవన్నాయికగానే అవతరించిన గోదాదేవి పాడిన ప్రబంధాలకుండే వైలక్షణ్యం అనితరసాధారణం. వేదవేదాంతపు రహస్యాలను ఆవిష్కరించిన ప్రబంధాలవి.

గోదాదేవి అనుగ్రహించిన మొదటి ప్రబంధంగా సుప్రసిద్ధమైన తిరుప్పావైకి పూర్వాచార్యులు ప్రామాణికములైన నాలుగు వ్యాఖ్యానాలను ప్రసాదించారు. అలానే నాచ్చియార్ తిరుమొళికి కూడా పెరియ వాచ్చాన్ పిళ్ళై స్వామి వ్యాఖ్యానం సుప్రసిద్ధమే. కాలక్రమంగా ఆయా భాషలలో అనువదిస్తే తప్ప సామాన్యులకు ఆ గ్రంథపు సౌరభాలందడం కష్టమైంది.

ఎంతో మంది ఉభయవేదాంత పండితులు, ఆయా గ్రంథాల గ్రంథులను విప్పుతూ జిజ్ఞాసువులకు కాలక్షేపంగా మంచి విషయాలను అందించి సంప్రదాయానికి మంచి సేవ చేశారు. అలాంటి మహనీయులలో విజయవాడనే కేంద్రంగా చేసుకొని సంప్రదాయప్రచారం చేసినవారు కీర్తిమూర్తి, పరమపదవాసులైన **శ్రీ ఉ.వే.శ్రీమాన్ తూపురాణి ఉడైయవర్ స్వామివారు.** తమ తిరుమాళిగను కాలక్షేపకూటంగా మలచుకొని ఎంతో మందికి జిజ్ఞాస కలిగించి ప్రేమతో వారు మంత్రార్థం నుండి భగవద్విషయం వరకు చాలా ఆవృత్తులు గ్రన్థపాఠం చెప్పి మహోపకారం చేశారు.

వారి కోడలు **శ్రీమతి పద్మగారు** వారికి అన్ని విధాలుగా సేవలనందించి కృపాపాత్రురాలై వారిలో ఉండే మంచి జ్ఞానాన్ని గ్రహించి కాలక్షేపగోష్ఠిని కొనసాగిస్తూన్నారు. చాలా సంతోషం. గోదాదేవి అనుగ్రహించిన **నాచ్చియార్ తిరుమొళి** ప్రబంధానికి పెద్దలద్వారా చక్కటి తెలుగు వ్యాఖ్యానాన్ని వ్రాయించి జిజ్ఞాసువులకందచేయాలని శ్రీపద్మగారు మంచి సంకల్పం చేసారు. ఆనందదాయకమైన విషయం.

శ్రీ ఉ.వే. శ్రీమాన్ శింగరాచార్యస్వామివారు ఎన్నో ద్రవిడవ్యాఖ్యాన గ్రంథాలను అనువదించి అనుభవంలో పరిపక్వత చెందిన మహానుభావులు. వారు నాచ్చియార్‌తిరుమొళిని ప్రతిపదార్థ తాత్పర్య – వ్యాఖ్యానాలతో చక్కగా అనువాదం చేసి అందించినందుకు వారికీ మేము అనేకానేక మంగళాశాసనాలు చేస్తున్నాం. నాచ్చియార్ తిరుమొళిని వ్యాఖ్యానంతో ముద్రించి జిజ్ఞాసువులకందిస్తూన్న **శ్రీమతి తూపురాణి పద్మగారికి**, వారి కాలక్షేపగోష్ఠి వారందరికీ కూడా మేము హృదయపూర్వకంగా అనేకానేక మంగళాశాసనాలు చేస్తున్నాం.

పర్దతామభివర్దతామ్.

7.12.2023 **జైశ్రీమన్నారాయణ!**

★★★★★

Regd Office : JET, 1-2-412/1/3, Gagan Mahal, Valmiki Nagar, Domalguda, Himayatnagar, Hyderabad, Telangana 500029
Admin Office : Sitanagaram, Guntur Dist. -522 501.
Phone : (08645) 272929, 272353.
E-mail : jetsitanagaram@gmail.com
Internet : www.chinnajeeyar.org

శ్రీమత్ ఉపనిషత్ సిద్ధాంత ఆచార్య పీఠము

(రిజిస్టర్డ్ ట్రస్ట్ 327/95, తేది 18-8-95)

శ్రీ జీయర్ స్వామివారి కార్యాలయం
డో.నెం.7-7-41, పట్టాభివీధి, సిమెంట్ రోడ్,
రామారావుపేట, కాకినాడ - 533 004.
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్స్ : 0884 - 2371064.

వ్యవస్థాపకులు
పరమహంస పరివ్రాజకాచార్య
శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరంగ
రామానుజ జీయర్ స్వామివారు

తేది : 13-12-2023
స్థలము : ఆశ్రమం, జి.వేమవరం.

మంగళాశాసనములు

పరమపదవాసులు శ్రీ ఉ.వే.శ్రీమాన్ ఉడయవర్ స్వామివారు సంప్రదాయ విషయంలో ఋషితుల్యులు. ద్రవిడ వేదాంత గ్రంథాలని తపోదీక్షగా ఎందరికో అనుగ్రహించి ధన్యతని కటాక్షించేరు వారందరికీ! వారి సంస్మరణ సందర్భంగా ద్రవిడ వేదాంత సాగర చంద్రుని వంటి నాచ్చియార్ తిరుమొళ్ళి దివ్య ప్రబంధ వ్యాఖ్యాన తెలుగు అనువాదాన్ని ప్రకాశింపచేయబూనడం మిక్కిలి సముచితంగా ఉన్నది, వారి అనుయాయులకు.

పండితరత్న శ్రీ ఉ.వే.శ్రీమాన్ డా॥ శింగరాచార్య స్వామివారు అసంఖ్యాకమైన గ్రంథాలను ద్రవిడ, సంస్కృత భాషల నుండి తెలుగుకి అనువదించి, సంప్రదాయానికి మహోపకారం చేస్తున్న వారిలో అగ్రతాంబూలం స్వీకరించతగిన దివ్య స్థానంలో విరాజిల్లుతున్న వారు! వారు పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యానానికి తెలుగు అనువాదం కటాక్షించడం మరింత సముచితంగా ఉన్నది!

శ్రీమాన్ ఉడయవర్ స్వామివారి శ్రీపాదాలని ఆశ్రయించిన గోష్ఠి వారందరూ ఈ గ్రంథ ముద్రణకి సిద్ధపడడం శ్రియఃపతికి మిక్కిలి ప్రీతి కలిగిస్తుందనడంలో సందేహమేమీ లేదు. ఈ సందర్భంగా అందరికీ స్వరూపానురూపమైన మంగళాశాసనములు.

(శ్రీరంగ రామానుజ చిన్నజీయర్)

Srimathe Ramanujaya Namaha

Srimathe Narayanaya Namaha

Regd.

SRIMATH UBHAYA VEDANTHA ACHARYA PEETAM TRUST

Administrative Office: Sitanagaram-522501, Guntur Dt. Andhra Pradesh. Ph:08645272929/272353

Founder: H.H. Sri Sri Sri Tridandi Srimannarayana Ramanuja Jeeyar Swami

Managing Trustee: H.H. Sri Sri Sri Tridandi Chinna Srimannarayana Ramanuja Jeeyar Swami

జై శ్రీమన్నారాయణ!

మంగళాశాసనము

భగవంతుని అవతారములు అసంఖ్యాకములు. పర, వ్యూహ, విభవ, అన్తర్యామి, అర్చా అవతారాలని శాస్త్రము తెలియచేస్తుంది. వీటిలో మనం ఈ నేత్రాలతో చూడగల్గినది అర్చావతారమే. సర్వేశ్వరుడు తాను సర్వశక్తి కలవాడైనా, ప్రేమించే భక్తునికి పరాధీనుడు. భగవంతుడు స్వీకరించిన 'అర్చావతారాన్ని' ఓ బొమ్మగా చూడడం తగదు. ఆయన సాక్షాత్తు పరబ్రహ్మమే అని దర్శించి భక్తితో పూలమాలలను, పాటల మాలికలతో కట్టివేసి, అర్చావతారంలో ఉన్న శ్రీరంగనినే వివాహమాడిన తల్లి మన గోదాదేవి. భగవంతుని కీర్తిస్తూ రెండు ప్రబంధాలను మనకందించింది గోదమ్మ. మొదటిది 30 పాశురాలు కల తిరుప్పావై మనందరికీ సామాన్యంగా తెలుసును. ఇక రెండవ ప్రబంధం **'నాచ్చియార్ తిరుమొజి'** 14 దశకాలలో 143 పాశురాలు కల ఈ ప్రబంధం చాలా విలక్షణమైనది. భగవంతుని పొందాలనే **'ప్రాప్యత్వర'**ను తెలియజేసే క్రమంలో **'కామదేవుని'** ప్రార్థించింది గోదమ్మ. భాగవత సమాశ్రయణ పూర్వకంగా భగవంతుని ఆశ్రయించాలని నిరూపిస్తుంది ఈ ఘట్టము.

'మల్లినాడాణ్ణ మదమయిల్' అని గోదాదేవిని ఓ అందమైన నెమలిగా కీర్తించారు తిరుకణ్ణమంగై ఆండాన్. నీలి మేఘాన్ని చూచి పురివిప్పి ఆడే నెమలి అందం వర్ణనాతీతము. నీల మేఘశ్యాముని చూసి కృష్ణ భక్తి తత్త్వాన్ని పాశురాలుగా పాడి అందిస్తున్న అందమైన నెమలి అని గోదాదేవిని కీర్తించారు. తిరుమాలిరుం శోలై, శ్రీరంగం, తిరుమల మొదలైన దివ్యదేశాలలోని అర్చామూర్తి వైభవాన్ని పాడి **'విరుందా వనత్తే కండోమే'** ఆ స్వామిని బృందావనములో సేవించామని ముగుస్తుంది ఈ ప్రబంధము.

అటువంటి ఈ ప్రబంధాన్ని శ్రీ.ఉ.వే. శ్రీమాన్ డా॥ ఇ.ఎ. శింగరాచార్యస్వామి శ్రీ పిళ్ళైలోకమ్ జీయర్‌స్వామి కృప చేసిన తమిళ వ్యాఖ్యానాన్ని తెలుగులో అనువదించి ఆస్తికాగ్రేసరుల దాహార్తిని తీర్చిన మహనీయులు.

విశేషించి మా ఆచార్యులు **కీర్తిమూర్తులు శ్రీ.ఉ.వే. శ్రీమాన్ తూపురాణి ఉదయవర్ల స్వామి** వారి స్మృత్యర్థం వారి శిష్యురాలు విశేషించి కోడలు శ్రీమతి తూపురాణి పద్మగారు తమ కాలక్షేప గోష్ఠి ద్వారా ఈ గ్రంథాన్ని లోకార్పణ చేయడము ముదావహము.

శ్రీమతి పద్మగారు ఆచార్యుల ఆజ్ఞతో ప్రత్యక్షంగాను, కంప్యూటర్ మాధ్యమంగాను ఆస్తికలోకానికి సంప్రదాయ గ్రంథాలు పాఠాలుగా, ప్రవచనములుగా అందిస్తూ చక్కని సేవ చేస్తున్నారు. వీరి కాలక్షేప గోష్ఠి ద్వారా మరిన్ని గ్రంథాలు లోకానికి అందాలని ఆశిస్తూ అనేక మంగళాశాసనాలు.

అమ్మోళిలదాసులు చిన్నజీయర్.

జయ గోవింద !
జయ గోవింద!!
శ్రీ భాష్యకార సిద్ధాన్త పీఠము
రిజిష్టర్ నెం. 8/2000
1-4-2, నూర్మనారాయణపురం, జీయర్ మార్గ్, అడ్డ వంతెన వద్ద, జువ్వలపాలెం రోడ్,
భీమవరం - 534 202, వ॥గో॥జిల్లా, ఆం.ప్ర. ఫోన్ : 08816-227599
వ్యవస్థాపకులు : శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీరామచంద్ర రామానుజ జీయరుస్వామివారు

శ్రీమతి తూపురాణి పద్మగారికి,

అమ్మా మీరు "నాచ్చియార్ తిరుమొజి" వ్యాఖ్యాన గ్రంధము అనువాదముతో ముద్రించుచున్నారని తెలిసి సంతోషిస్తున్నాము.

ఆండాళ్ తల్లి కృష్ణునిపై తనకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ, అది స్థిరమై ఫలవంతమవ్వాలని, దేవతాంతరమును వేడికొని అయినా శ్రీకృష్ణుని పొందాలని తపించి, తన అనుభవమును పాడిన పాశురములు ఎంతో మధురంగా, హృద్యంగా అనుగ్రహించి, భగవంతుని భర్తగా పొందాలనుకొనే వారికి మార్గదర్శిగా లోకమునకు మాధుర్య భక్తిని చాటిచెప్పిన మహానుభావురాలు.

ఆ గోదాతల్లి యొక్క పరిపూర్ణ కటాక్షంతో ఇది అందరి మనస్సులలో భగవంతునిపై ప్రేమభక్తిని కలిగించి లోకులను తరింపజేయగలదు.




శ్రీమతే రామానుజాయ నమ :
శ్రీమత్ అష్టాక్షరీ పీఠం
రిజిష్టర్ నెం. 66/2002
డో. నెం. 1-3/21-30, గురుకృప రోడ్డు, విద్యాధరపురం,
కామకోటినగర్, విజయవాడ-520 012.
వ్యవస్థాపకులు : పరమహంస పరివ్రాజకులు శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ
సంపత్కుమార రామానుజ జీయరు స్వామివారు

॥ అస్మద్ గురుభ్యో నమః ॥

ప్రియ భగవత్బంధువులారా ! తేదీ: 18/04/2024

శ్రీమతి తూపురాణి పద్మ గారు మంచి పండితురాలు. శ్రీ ఉ.వే. శ్రీమాన్ తూపురాణి ఉడయవర్లు స్వామివారి కోడలు, శిష్యురాలు. చక్కటి ప్రవచన దోరణి కలిగినటువంటి ఆమె. ఉడయవర్లు స్వామివారి సన్నిధానంలో గ్రంధాలన్ని చాలా శ్రద్ధగా సేవించినటువంటి శ్రద్ధాళువు. వారు ఆన్లైన్ ద్వారా తాము ఆచార్యుల సన్నిధానంలో తెలుసుకున్నటువంటి అనేక విషయాలను క్రమంగా అనుసంధానం చేసుకొంటూ అందరికి అందిస్తూ వున్నారు. వీరంతా ఒక గోష్ఠిగా ఏర్పడి ఆండాళ్ళమ్మ వారు అనుగ్రహించినటువంటి నాచ్చియార్ తిరుముజి దివ్య ప్రబంధానికి వ్యాఖ్యానాన్ని ఉడయవర్లు స్వామివారి స్మృత్యర్థం సమాజానికి అందివ్వాలని, శ్రీమాన్ ఉ.వే. శింగరాచార్యస్వామి వారి ద్వారా వ్యాఖ్యానాన్ని వ్రాయించి, ఆ వ్యాఖ్యాన సహితంగా నాచ్చియార్ తిరుముజి దివ్య ప్రబంధాన్ని ముద్రణ గావించ సంకల్పించారు శ్రీమతి తూపురాణి పద్మ గారు. వీరి సంకల్పానుసారంగా వారి గోష్ఠి సభ్యులందరు కలసి ఈ ముద్రణకు అయ్యేటటువంటి ద్రవ్యాన్ని సమకూర్చుకొని సమాజానికి ఒక మంచి గ్రంధాన్ని ఇద్దాము పూర్వాచార్యుల యొక్క వ్యాఖ్యానాన్ని చెదరకుండా పదిలం చేద్దాము

అనే ఉద్దేశ్యంతోటి వారు చేస్తున్నటువంటి ప్రయత్నాన్ని మేము స్వాగతిస్తున్నాం. ఇలానే శ్రీమతి తూపురాణి పద్మగారు అనేకానేక గ్రంధాలను కాలక్షేపం చేస్తూ అలాగే ముద్రణ కార్యక్రమాలు చేస్తూ వ్యాఖ్యానాన్ని ఎప్పటికి సమాజంలో ఉండేటట్లుగా వీరు చిన్నగా ఆరంభించినటువంటి ఈ కార్యక్రమం ఒక ఉద్యమంగా ఒక పెద్ద వ్యవస్థాగా కొనసాగాలి అని మేము కోరుకుంటున్నాం. మా ఉడయవర్లు స్వామివారు సత్యసంకల్పులు. వారు భగవత్ విషయాన్ని సమాజానికి అందించడం కోసమే వారు విశ్రాంత జీవితాన్నంతటిని గడిపినటువంటి మహనీయులు. వారిని ఎప్పుడూ స్మరించుకోవటానికి ఈ సమాజానికి వీలుగా ఉంటుంది అని పద్మగారి ఈ ప్రయత్నం సాఫల్యం కావాలి, ఇది మరింత ఉధృతంగా సాగాలి, అనేక గ్రంధాలు వీరి గోష్ఠి ద్వారా ముద్రణ జరగాలి, కాలక్షేపం జరగాలి అని మేము భగవంతుణ్ని ప్రార్థిస్తూ శ్రీమతి తూపురాణి పద్మ గారికి వారి గోష్ఠి సభ్యులందరికి మేము అనేకానేక మంగళాశాసనములు తెలియజేస్తున్నాం.

జై శ్రీమన్నారాయణ

మకాం :-

గోదా గోకులం, కర్నూలు

(శ్రీశ్రీశ్రీ త్రిదండి అష్టాక్షరీ సంపత్కుమార

రామానుజ జీయర్‌స్వామి)

ఓం నమో నారాయణాయ
మహామహోపాధ్యాయ, శాస్త్రభాస్కర,
శాస్త్రరత్నాకర
రాష్ట్రపతి అవార్డు గ్రహీత
డా. సముద్రాల వేంకటరంగరామానుజాచార్యులు
క్వార్టర్ నెం.108, జీవా క్యాంపస్,
జీయర్ ఇండిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ క్వార్టర్స్
ఇమెయిల్: svrracharyulu@gmail.com
acharyulusvrr@yahoo.in

శ్రీమతే రామానుజాయనమః
మొబైల్ నెం.: 9441562863, 9676825361
డైరెక్టర్
వేదిక్ రీసెర్చ్ అండ్ పబ్లికేషన్స్
జీయర్ ఇంటిగ్రేటెడ్ వేదిక్ అకాడమీ (జీవా)
శ్రీరామనగర్, ముచ్చింతల్,
పాలమాకుల (పో.), శంశాబాద్ (మం.),
రంగారెడ్డి జిల్లా, తెలంగాణ - 509 325.

తేదీ: 05-01-2024

స్వవపురూషితాం పుష్పమాలాం శ్రీహరయే ముదా ।
అర్పయిత్వా సంబభూవ స్తుత్యా సాఽఽ ముక్తమాల్యదా ॥

తెలుగు ప్రబంధకర్మ కృష్ణదేవరాయల మహాప్రబంధం మూలంగా లోకానికి "ఆముక్తమాల్యద"గా ప్రసిద్ధిచెంది స్థిరపరిచితమైన గోదమ్మ, తానున్న శ్రీవిల్లి పుత్తూరునే బృందావనంగాను నందగోకులంగాను భావించి స్వామిని మార్గశిరమాసంలో ఉపశ్లోకించి చిరకీర్తిని పొందింది. ఆమె లోకానికి నిత్యాను సంధేయంగా అనుగ్రహించిన చిన్న ప్రబంధం తిరుప్పావుగా ప్రసిద్ధంకాగా, ఆమెయే అనుగ్రహించిన మరొక ప్రబంధం "నాచ్చియార్ తిరుమొళి" అంతగా లోకపరిచితం కాదు. వాస్తవానికి తిరుప్పావుకంటే కవితావైభవం విశేషంగా కలది ఈ ప్రబంధమయినా నిత్యానుసంధేయంకాలేదు. కాని తిరుమలలో స్వామి సన్నిధిని దీన్ని విశేషసందర్భాల్లో అనుసంధించే ప్రక్రియ ఉంది.

శుక్రవారం స్వామికి, స్వామివారి కంఠసీమను అలంకరించిన సువర్ణమాలలోని ద్విభుజలక్ష్మికి తిరుమంజనం చేసినప్పుడు, నాచ్చెయార్ తిరుమొళిని అనుసంధించడం ఉంది. దానికి కారణం అమ్మవారి విరహాన్ని స్వామి పొందాడన్న భావనయే.

ధనుర్మాసంలో శ్రీకృష్ణునితోనే భోగపర్యంకశయన మనే లీలారసాన్ని అనుభవించవలెననే కోరికగల శ్రీగోద ఆలయంలో ప్రతిదిన అనుసంధింపవలసిన ముప్పై పాశురాలను తిరుప్పావైగా అనుగ్రహించి, ఆ స్వామి యందే విశేషాదరముండుటను, తానే అనుగ్రహించిన నాచ్చియార్ తిరుమొళి ద్వారా స్పష్టపరచింది. ఈ విషయం నాచ్చియార్ తిరుమొళిలోని ప్రథమగాథలోనే విస్పష్టమైంది.

తైయొరు విజ్ఞుణ్డరై విళక్కిత్తణ్
మండలమిట్టు మాశిమున్నాళ్
ఐయనుణ్ మరంకొండు తెరువణి న్దు
అళగినుక్కలజ్గరిత్తనజ్గతే వా
ఉయ్యవు మాట్గో వెను శొల్లి యున్నెయుమ్
ఉంబియైయుంతొళు తేన్
వెయ్యతోర్ తళులు మిళ్ శక్కర క్కె
వేజ్గడవర్కెన్నై విది క్కిత్తియే

అన్నపాశురంలో "వేజ్గడవర్కు ఎన్నై విది క్కిత్తియే" అనడాన్నిబట్టి, ఈమె ఎందరు దేవతలున్నా వేంకటేశ్వరుని పట్ల విశేషప్రీతికలిగి ఉండినదని విశదమవుతుంది. విశేషించి "విజ్ఞీలమేలాప్పు" లాంటి దశకాలు ఇదే విషయాన్ని మరింత విశదపరుస్తాయి. బహుకాలం క్రితం ఈ దశకాన్ని దాసుడు సంస్కృతీకరించాడు. ఆ శ్లోకాలు 1, 2 ఇక్కడ ఇస్తున్నాను.

ముక్తాహేమ సువర్ణినో జలముచః శ్రీవేంకటాద్రీశితుః
కిం వా తస్య మహాసుకీర్తిజనం స్వాభావ్యమే తద్విభోః ?
రాత్రే దుర్భర మారుతాన్మలయజాత్ పంపీడి తాస్మీ హయా
వార్తాత స్వ చకాస్తి చేత్ ననుభవేత్ స్వాస్థ్యం మమాప్యన్వహమ్ ॥

విద్యుద్వేష్టిత వార్ధరాः ! స్తనభరం వక్షఃస్థలం మామకం
దృష్ట్వాకృష్ణమనాస్తు వేంకటపతిः లక్ష్మీనివాసే నిజే |
విస్తారే హృదయ స్థలే యది సదా గాఢం సమలింగితం
కుర్యాద్వేతి మహాశయాతి వివశం చేతస్తు దోలాయతే ॥

ఇది భావచ్ఛాను సరణం మాత్రమే ఈ గ్రంథరాజాన్ని ఉ.వే. శ్రీమాన్ ఉడయవర్లు స్వామి వారి ప్రీతికి సమర్పించడం సర్వథా స్పృహణీయం. ఇక్కడ ఒక విషయం విశేషంగా ప్రస్తావిస్తున్నాను ఏమిటంటే....

తిరుప్పావై ముందు వ్రాసినదా? నాచ్చియార్ తిరుమొళియా? అని. నాచ్చియార్ తిరుమొళిలో కామదేవుడు, అమ్మవారు మొదలైన దేవతాన్తరాలను ఆశ్రయించడం ఉంది. ఇది సంప్రదాయ నిష్ఠకు ప్రతిబంధం. ఇక తిరుప్పావైలో

'నారాయణనే' అంటూ శ్రీమన్నారాయణుని మాత్రమే అనన్య బుద్ధితో ఆశ్రయించడం జరిగింది. ఇదే శ్రీవైష్ణవ నిష్ఠకు అనుకూలం. కనుక, ముందు ఇతరేతర దేవతాశ్రయణ మూఖంగా నాచ్చియార్ తిరుమొళిని ముందుగా అనుగ్రహించి, చివరికి పూర్ణ నిష్ఠను పొంది తిరుప్పావై వ్రతాన్ని ఆచరించి ప్రతిబోధించినది గోదమ్మ అని కొందరు ఒక పక్షాన్ని లేవదీశారు. కాని ఆచార్యుల నిర్ణయాన్నిబట్టి తిరుప్పావై మొదటిది. ఇంతగా అనన్య భావనతో స్వామిని ఆశ్రయించి ఉపాసనం చేసినా, ఆయన అనుగ్రహించలేదనే భావనతో ఉద్వేల విరహాన్ని అనుభవించి తరువాత (చివరగా) నాచ్చియార్ తిరుమొళిని అనుగ్రహించింది గోదమ్మ అని ఆచార్యుల భావన. ఇదే సర్వసమ్మతం.

14 దశకాలతో కూడిన ఈ నాచ్చియార్ తిరుమొళి ప్రబంధంలో వారణ మాయిరం బాగా ప్రసిద్ధి చెందింది. ద్రావిడ దేశంలో. దీన్ని వివాహాదుల్లో అనుసంధానం చేసే ప్రక్రియ ఉంది. వైష్ణవాలయాల్లో కల్యాణంలో భాగంగా దీన్ని అనుసంధిస్తున్నారు. వివాహం కాని ఆడపిల్లలు దీన్ని అనుసంధిస్తే త్వరగా వివాహం అవుతుందనే విశ్వాసం కూడా విశేషంగా ఉంది.

ఇలాంటి ఈ ప్రబంధాన్ని, శ్రీమాన్ సింగరాచార్య స్వామివారి వివరణంలో ప్రకాశింపజేస్తున్న చి.సౌ. పద్మ ప్రభృతులు అభినందనీయులు. ఇది ఉడవర్లు స్వామివారి ప్రీతికి కారణం కావడం మరీ విశేషం. అస్తు.

దేవరవారి వ్యాఖ్యా వివరణం తెలుగు పాఠక వర్గానికి అపారజ్ఞాన సముపార్జన సాధనం కావాలని ఆశిస్తూ దాసోహాలతో దాసుడు రంగరామానుజాచార్యులు.

జీవా ప్రాంగణం
సంశోధన గ్రంథప్రకాశన విభాగము
శ్రీరామనగరం
05-01-2024

రాష్ట్రపతి పురస్కృతుడు
'మహామహోపాధ్యాయ' 'శాస్త్రరత్నాకర' 'శాస్త్రభాస్కర'
డా|| సముద్రాల వేంకటరంగరామానుజాచార్యులు
డైరెక్టర్, జీవా సంశోధన ప్రకాశనము

★★★★★

అస్మద్ గురుభ్యో నమః

నమ్ర నివేదన

ఉభయ వేదాంత, ప్రవర్తకులు శ్రీమాన్ తూపురాణి ఉడయవర్లు స్వామివారు భగవద్విషయాది దివ్య ప్రబంధాలను అను గ్రహించిన అస్మదాచార్యులు, సాక్షాత్తుగా నాకు పెద్దన్నయ్యగారు. వారి జీవితమంతా దివ్యప్రబంధాను సంధాన పూర్వక, వైభవాత్మక కాలక్షేపములతో, ఉపన్యాసములతో అద్భుతంగా సాగింది, వారేరీ! అని ఒక్కసారి దుఃఖం పొంగి వస్తున్నా, 'జాతస్యహి' అన్నట్లు అనివార్యమైన కాలశక్తికి తల వంచవలసినదే గదా అని ధైర్యం తెచ్చుకొనడమే గాని ఏమీ చేయలేని స్థితి. ఆ మహనీయునికి స్మృత్యంజలిగా శిష్యకోటి అంతా కలసి దివ్య ప్రబంధాన్ని – అందునా 'నాచ్చియార్ తిరుమొజి' అనే అండాళ్ తల్లి అనుగ్రహించిన అత్యద్భుత ప్రబంధాన్ని లోకానికి అందించాలి. అనుకొనడం అత్యంతాభినందనీయం.

ఆండాళ్ తల్లి తిరుప్పావైతో పాటు 'నాచ్చియార్ తిరుమొళి' అనే 143 పాశురాలు గల్గిన, 14 దశకాలతో కూడిన దివ్య ప్రబంధాన్ని అనుగ్రహించడం లోకం చేసుకున్న భాగ్యం. గోదామాత ఆచార్యనిష్ఠకే పేరుగా నిలచిన భూజాత. ఈ తల్లి రచనా సౌందర్యాన్ని, మాధుర్యాన్ని అస్వాదించాలంటే మన పూర్వాచార్యులు అనుగ్రహించిన వ్యాఖ్యానాలే మనకి దిక్కు. నాలాయిర దివ్య ప్రబంధాలకి మధుర వ్యాఖ్యానాన్ని అనుగ్రహించిన మహోపకారకులు పెరియవాచ్చాన్ పిళ్లై వీరినే శ్రీ కృష్ణ సూరి అని కూడా అంటారు. వీరు శ్రావణ కృష్ణాష్టమినాడు రోహిణీ నక్షత్రంలో అవతరించారు. శ్రీకృష్ణుని అంశతో అవతరించడం వలన వారికి కృష్ణ సూరి అనే నామం సార్థకమైంది.

ఇక్కడ పెద్దలు ఒక విశేషకథని చెప్పారు. తిరుమంగై ఆళ్వార్ శ్రీ కృష్ణుని సంబోధిస్తూ చెప్పిన ప్రబంధాలని స్వయంగా వినాలని అనుకొన్నాడట. వినవయ్యా!

అన్నారట ఆళ్వార్లు. దానికి స్వామి అయ్యా! మీరు కార్తీక మాస కృత్తికలో తిరుక్కలిక్కన్ది దాసర్ గా అవతరిస్తారు. అప్పుడు నేను మీ శిష్యునిగా సకలార్థాలను లోకానికి తెలియ చేస్తాను అని అన్నారట. తిరుక్కలిక్కన్ది దాసర్ నంబిళ్లైగా అవతరిస్తే, శ్రీ కృష్ణుడు పెరియ వాచ్చాన్ పిళ్లైగా అవతరించి నాలాయిర సారాన్ని అద్భుత వ్యాఖ్యానంతో లోకానికి అందించారట. విశేషమేమిటంటే సాక్షాతు, శ్రీరంగనాథుడు వీరికి 'అభయ ప్రద రాజులు' బిరుదును అనుగ్రహించారుట.

పెరియ వాచ్చాన్ పిళ్లై అనుగ్రహించిన నాచ్చియార్ తిరుమొజి వ్యాఖ్యానం తమిళంలో, మణి ప్రవాళంలో అద్దుతంగా సాగింది. ఆ భాషతో పరిచయం లేనివారికి అది అందని ద్రాక్ష పండే అయింది. మరి తెలుగు వారికి ఆ మాధుర్యాన్ని అస్వాదించే భాగ్యం ఎలా కలుగుతుంది? ఆ అదృష్టాన్ని మనకందించిన మహోపకారకులు శ్రీమాన్ ఈయుణ్ణి సింగరాచార్య స్వామి వారు. వీరు వ్యాఖ్యాత్ర చక్రవర్తులై, సంప్రదాయ గ్రంథాలన్నిటికీ అద్భుత ఆంధ్రానువాదాన్ని అందించి జాతికి అనితర సాధ్యమైన ఉపకారం గావించారు. శ్రీమాన్ ఉడయవర్లు స్వామి వారితో వీరికి గల అనుబంధం మాటలకందనిది. ఆంధ్ర పెరియ వాచ్చాన్ పిళ్లైగా వీరు పొందిన బిరుద నామం అక్షర సత్యమై నిలచింది. వీరి వ్యాఖ్యానంలో ఆళ్వార్ల మధురభావాలు, శ్రీరామాయణ రహస్యార్థాలు, సంప్రదాయ శ్రీ సూక్తులు కోకొల్లలుగా వచ్చి చేరాయి. నాన్యతో దర్శనీయ మైన వ్యాఖ్యాన శైలి వీరిది. వారు మా అన్నగారికి స్మృత్యంజలిగా నాచ్చియార్ తిరుమొజికి ఆంధ్ర వ్యాఖ్యానాన్ని ముద్రించడానికి అనుగ్రహించడం జాతి చేసుకున్న సౌభాగ్యం. వీరికి కృతజ్ఞతా పూర్వక దాసోహములు.

శ్రీ మాన్ ఉడయవర్లు స్వామి వారి కుటుంబ సభ్యులు ఆ గ్రంధానికి నా అభిప్రాయాన్ని వెలువరించే అవకాశం కల్పించినందుకు వారికి ధన్యవాదాలు.

'యస్మిన్ జీవతి జీవన్తి బహవః సతు జీవతి' అనే సూక్తి, ఉడయవర్లు స్వామివారికి పూర్తిగా వర్తిస్తుంది. వారి శ్రీ సూక్తుల వలన దివ్యానందాన్ని పొందిన శిష్యకోటి ధన్యులు. వారిని నడయాడే భగవద్విషయం అని పెద్దలు పలుకడం నిత్యసత్యం. 18 పర్యాయాలు భగవద్ విషయాన్ని లోకానికి అందించిన ధన్యజీవి ఉడయవర్ స్వామి వారు. ఆండాళ్ తల్లి 'ఉందన్నై పిరవి' అన్నట్లుగా వారికి సోదరిగా జన్మించడం నా పూర్వజన్మ సుకృతం. ఎదిగిన కొద్దీ ఒదగాలని స్వామివారు ఆచరించి చూపించారు. అణు మాత్రమైనా ఆతిశయం లేని ఉడయదర్ స్వామి వారు వినయ వినమ్రత గాత్రులై పెద్దలను సేవించడ మనేది లోకానికి వీరు చూపించిన, నేర్పించిన పాఠం అనడం అతిశయోక్తి కాదు.

ఆండాళ్ తల్లి అనుగ్రహించిన నాచ్చియార్ తిరుమొజి పెరియ వాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యానం, శ్రీమాన్ సింగరాచార్య స్వామి వారి ఆంధ్రానువాదం జాతికి మధుర భక్తి భావాన్ని కల్గించి, సంప్రదాయ నిష్ఠను చేకూర్చి, సాహిత్య వైభవాన్ని తెలియచేసి దివ్యానందాన్ని కల్గిస్తుంది. ప్రతి ఒక్కరూ తప్పక ఆ దివ్యానందాన్ని అస్వాదిస్తారని ఆశిస్తూ..

భాగవత చరణ దాసి,

డా. శ్రీమతి టి.కె. చూడామణి.

★★★★★

జై శ్రీమన్నారాయణ!

శ్రీమతే రామానుజాయ నమః

తూపురాణి అప్పలాచార్యులు
హైదరాబాదు

దిః 6.12.2023

అస్మద్ గురుభ్యోనమః

శ్రీగోదా వైభవాన్ని తెలియజేస్తూ, మణవాళ మహామునులు, తమ 'ఉపదేశరత్తినమాలై' ప్రబంధంలో 'అణ్డుకుడిక్కు ఒరు శన్ద తియాయ్" అని ఆండాళ్ తల్లిని పరిచయం చేస్తారు. ప్రపన్న కులానికి చెందిన ఆళ్వార్లు పదిమందికీ కుమార్తెగా అయి, 'అస్థానే భయశంక' కల వారైన భట్టనాథుల కులానికి సాటిలేని సంతానంగా లభించినది ఈ తల్లి. సాధారణంగా, మనకు లోకంలో కనిపించే విధానం ఒక పండు లభించాలంటే, ముందు పువ్వు, తరువాత పిందె, తరువాత కాయ, ఆ కాయ ముదిరి పండు... ఇదీ క్రమం.

కానీ, ఆండాళ్ తల్లి విషయంలో మాత్రం 'పిఱన్దాయ్ పఴుత్తాళై" అంటే పక్వం కాని పిందే, పక్వ ఫలం, అయినట్టు, పరమాత్మ యందు, ఈ తల్లికి గల వ్యామోహం ఫలించింది. పరమాత్మని పొందటానికి ఉపాయము, ఉపేయము రెండూ ఆ స్వామియే అనే అధ్యవసాయ స్థితిగల తల్లి. మానవ కాంతగా వుండి అర్చామూర్తిగా వేంచేసి యున్న శ్రీ రంగనాథుణ్ణి వలచి, వలపించుకున్న వాల్లభ్యము గల తల్లి ఆండాళ్. తిరుప్పావై వ్రతాన్ని ఆచరించి, లోకమంతా పాడి, పంటలతో సస్యశ్యామలంగా ఉండటానికి కావలసిన వరుణదేవుడి అనుగ్రహాన్ని పొంది, తనకు కావలసిన ఆ పరమాత్మ యొక్క సంశ్లేష ఆనంద ఫలాన్ని పొందడానికి, ఆ స్వామి యొక్క కృపా కటాక్ష వీక్షణ వర్షధారలతో తడిసి, ముద్దైనటువంటి తల్లి. ఆ తల్లి అనుగ్రహించిన 'తిరుప్పావై' ప్రబంధ పాశురములు, ప్రపన్న కుటుంబములలో అనునిత్యం అనుసంధనీయములు గదా! తిరుప్పావై వ్రత సమాప్తికి, శ్రీరంగనాథునితో కళ్యాణము జరుగడానికి మధ్య కాలములో ఆ తల్లి, క్షణమొక యుగముగా భావించింది. ఆ సమయములో, ఆ తల్లి అనుభవించిన ఆర్తి వాక్ రూపములో బయటకు ఆవిష్కరింపబడింది. ఆ వాగ్రూపమే, ప్రస్తుత గ్రంథస్తమైన "నాచ్చియార్ తిరువాఴ్మొళి".

నమ్మాళ్వార్, పరాంకుశ నాయికగా, పరమాత్మ విశ్లేషదుఖాన్ని అనుభవిస్తూ, ఏ ఏ భావాలని వ్యక్తం చేస్తూ, 'తిరువాయ్ మొళి' ప్రబంధంలో, తన ఆర్తిని వివిధ మనోభావన రూపంలో ఆవిష్కరించారో, అలాంటి భావాలనే, ఆండాళ్‌తల్లి గూడా ఈ నాచ్చియార్ తిరుమొళి ప్రబంధంలో మనకు అనుగ్రహించింది.

తన దుఃఖాన్ని స్వామికి తెలియజేయవలసినదిగా పక్షులను ప్రార్థించడం, ప్రకృతిలో సహజంగా ప్రవర్తిస్తున్న చరాచరములన్నీ, స్వామియొక్క విరహం చేత, తనలాగా దుఃఖిస్తున్నాయని భావించడం. రాత్రింబవళ్ళు దుఃఖంతో, నిదురలేక పరితపించడం, ఆ స్వామి ధరించిన అందమైన, చల్లని, మధువులూరే తులసి మాల తనకు లభిస్తే చాలు అని భావించడం, స్వామితో కలసిన ఆనందాన్ని పంచుకోడానికి ఈ లోకంలో వారు లభించకపోతే నిత్యసూరుల గోష్ఠిలో చేరి ఆ ఆనందాన్ని, వారితో పంచుకోవాలసుకోవడం... ఇలా ఎన్నో ఎన్నో విషయాలు, తిరువాయ్ మోఴ్ఴి ప్రబంధంలో వలనే ఈ నాచ్చియార్ తిరుమొఴ్ఴి ప్రబంధంలో గూడా ఆవిష్కరింపబడ్డాయి.

దాసుడికి అన్నగారు, భగవద్విషయాన్ని అనుగ్రహించిన ఆచార్యులు, పరమపదవాసులు, ఉభయవేదాన్త ప్రవర్తకులు, వేదాన్తవాచస్పతి శ్రీమాన్ తూపురాణి ఉడయవరుస్వామివారు. 'స్నుషాదశరథస్యాహం" (నేను దశరథ మహారాజు యొక్క కోడలిని") అని సీతాదేవి తనని తాను పరిచయం చేసుకునేదిట. అలాగే, ఉడయవర్ స్వామి వారి కోడలు చిలసౌ పద్మ శ్రీనివాస్, మామగారి వద్ద దివ్యప్రబంధాలన్నీ సేవించి, చక్కని ఉపన్యాస ధోరణి కలిగి వుండి, భాగవతోత్తముల మంగళాశాసనములు పొందుతోంది. శ్రీమతి పద్మ, ఈ నాచ్చియార్ తిరుమోఴ్ఴి ప్రబంధాన్ని, ఆర్తిగల వారికి పాఠం నేర్పి, శాత్తు జరిపించడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. భవిష్యత్తులో, మరిన్ని సంప్రదాయ ప్రబంధ ప్రచార వైభవాన్ని కొనసాగించవలెనని, తనకు భగవత్, భాగవత, **ఆచార్య కృపాకటాక్షణములు పరిపూర్ణంగా లభించాలని కోరుకుంటూ....**

దాసుడు
తూపురాణి అప్పలాచార్యులు

విజ్ఞప్తి

"దేహమే ఆత్మ" అని భావించేవారైన సంసారులకు ,ఆత్మ స్వరూపాన్ని తెలిసినవారైన ఋషులకు మధ్య జ్ఞానంలో చాలా తేడా ఉన్నది. స్వప్రయత్నంతో పురుషోర్ధాన్ని పొందాలని ప్రయత్నించే ఋషులకు భగవంతుని వల్ల ఏ విధమైన విస్మృతి అజ్ఞానం లేని భక్తి రూపంగా పరిణమించిన జ్ఞానం పొందిన ఆళ్వారులకు మధ్య జ్ఞానంలో చాలా తేడా ఉన్నది. భగవంతుని అనుభవాన్ని ఆశపడిన ఆళ్వారులకు, భగవంతుని సమృద్ధిని ఆశపడిన పెరియాళ్వార్లకు మధ్య చాలా తేడా ఉన్నది. భగవంతుని సమృద్ధిని ఆశపడిన పెరియాళ్వారులకు, భాగవత సమృద్ధిని ఆశపడిన గోదాదేవికి చాలా తేడా ఉన్నది భగవంతుని అనుగ్రహం వల్ల ఏ అజ్ఞానం, విస్మృతి లేని, భక్తి రూపంగా పరిణమించిన జ్ఞానాన్ని పొందారు. కానీ, గోదాదేవి అయితే , ఆ భగవంతునకే ఉపదేశాన్ని చేసినది. సంసారంలో అజ్ఞానమనే నిద్రలో మునిగి ఉన్న ఆళ్వార్లను భగవానుడు ప్రబోధించి, జ్ఞానాన్ని ప్రసాదించాడు. నిద్రపోతున్న ఆ సర్వేశ్వరునకు ప్రబోధాన్ని పలికేవారైన తొండరడిప్పొడి ఆళ్వార్లు కూడా, మొదట ఆ శ్రీమన్నారాయణునివల్ల ప్రబోధాన్ని పొంది, తరువాత ఆ స్వామికి సుప్రభాతాన్ని పాడారు. " ఆవరైప్పిరాయమ్ తొడంగి ఎన్నుమ్ ఆదరిత్తెழுన్ద ఎన్ తడైముళైగళ్, తువరై ప్పిరానుక్కే శంకట్పిత్తు త్తొழுదువైత్తేన్" అని చెప్పినట్లుగా పుట్టినప్పటినుండే కేశవుని ప్రేమించిన గోదాదేవి ఆ స్వామిని నిద్రలేపింది.

ఆళ్వారులు లక్ష్మణస్వామివంటివారు. పెరియాళ్వార్లు శ్రీభరతుని వంటివారు. గోదాదేవి , మధురకవులు శ్రీశత్రుఘ్నుని వంటివారు. ఆళ్వారులు, లక్ష్మణ స్వామి భగవంతుని అనుభవాన్ని ఆశపడ్డారు. శ్రభరతుడు, పెరియాళ్వార్లు భగవత్సమర్ధిని ఆశపడ్డారు .శ్రీ శత్రుఘ్నుడు, గోదాదేవి, మధురకవులు భాగవత శేషత్వాన్ని ఆచరించి చూపించారు..

అంతేకాకుండా, లోకంలో ఒక పురుషుడు ఇంకొక పురుషుని ప్రేమించడం కంటే, ఒక స్త్రీ పురుషుని చూచి ప్రేమించడం అనేది చాలా సహజమైనది కనుక, ఆళ్వారుల భక్తిని కంటే పది రెట్లు ఎక్కువగా భగవంతుని విషయంలో ప్రేమను కలిగినది, ఈ గోదాదేవి. " పదిమంది ఆళ్వారుల జ్ఞానం అంతటినీ తన స్త్రీధనంగా ఈమెలో గూడు కట్టుకొని ఉన్నది. పదిమంది ఆళ్వారులకు ఈమె ఒక్కతేకదా, స్త్రీసంతానం " అని జనన్యాచార్యులవారు తిరుప్పావై వ్యాఖ్యానం అవతారికలో అనుగ్రహించారు.

ఇటువంటి గొప్పతనాన్ని కలిగిన గోదాదేవి చేత అనుగ్రహింపబడిన ఈ ప్రబంధానికి మిగిలిన దివ్యప్రబంధాలకు అనుగ్రహించిన వ్యాఖ్యానాల కంటే, అతివిలక్షణమైన ఒక వ్యాఖ్యానాన్ని పరమ కారుణికులు అయిన పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించారు .ఈ వ్యాఖ్యానాన్ని సేవించి ఆనందాన్ని పొందిన రసికులైన మహానుభావులు.

"గోదాగభీరవచసాం పరమార్ధ భావం జానాతి కృష్ణగురురేవ కి మత్రచిత్రమ్?
యత్ కృష్ణ ఏవ సువిచార్య నిరూఢభావాం గోదాం ప్రియా మభిమతా మురరీచకార"

(గోదాదేవి పలికిన, చాల గంభీరమైన శ్రీసూక్తులలోని వాస్తవమైన భావాలను శ్రీకృష్ణ సూరి మాత్రమే తెలియగలరు.. ఇందులో ఏమి ఆశ్చర్యం ఉన్నది? ఎందుకంటే, తన విషయంలో మిక్కిలి అభినివేశాన్ని పొందినది, తనకు చాలా ప్రియమైనది అయిన గోదాదేవిని చక్కగా శోధించి, ఆ కృష్ణుడే కదా పరిగ్రహించాడు) అని అన్నారు.

"కణ్ణ! నిన్ తనక్కు కుటిప్పాకిల్ కఱ్కలామ్ కవియిన్ పొరుళ్ తానే" అని తిరుమంగై ఆరువారుల చేత ప్రియమింపబడిన శ్రీకృష్ణుడే శ్రీ జయంతినాడు మళ్ళీ వేరొక కృష్ణుడుగా, అంటే, శ్రీకృష్ణసూరిరూపంలో, అవతరించి, తిరుమంగై ఆళ్వారుల వేరొక అవతారంగా కార్తీక మాసం కృత్తికా నక్షత్రంలో ఈ భూమిలో ఉండేవారు అందరూ తరించేటట్లుగా అవతరించినవారు, కలికన్ది దాసర్ అనే పేరు

కలిగినవారైన నంబిళ్ళై సన్నిధిలో నాలాయిర దివ్యప్రబంధాల అర్థాలను శ్రవణం చేసి, వాటిని ఈ లోకం అంతా తరించేటట్లుగా తమ వ్యాఖ్యానాల రూపంలో వ్యక్తం చేశారు – అని అంటారు కదా, మన పెద్దలు.

నాచ్చియార్ తిరుమొழி ప్రబంధానికి శ్రీకృష్ణసూరి అనే పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన రస్యగంబీరమైన వ్యాఖ్యానంలోని విశేషాలు చిరకాలంగా గురు శిష్య పరంపరలో ఉపదేశక్రమంలో అందుతూ వచ్చాయి. అయితే క్రమంగా కాలంలో వచ్చిన మార్పులను అనుసరించి ఇటువంటి వ్యాఖ్యానాలను ఆచార్యుల సన్నిధానంలో ప్రత్యక్షంగా మాత్రమే అధికరించాలనే నియమానికి కొన్ని మార్పులు చోటు చేసుకున్నాయి ఈ వ్యాఖ్యానాలకు ఆయా ప్రాంతాలలో ఉండే ఆస్తికులైన పాఠకులు గ్రహించడానికి వీలుగా ఉండే ఆయా భాషలలో అనువాదాలు, వివరణలు ఆవిర్భవించవలసిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిని దృష్టిలో పెట్టుకున్న కాంచీ మహావిద్వాన్, ప్రతివాది భయంకరమ్ అణ్ణంగరాచార్యస్వామివారివంటి మహానీయులు పలువురు ద్రావిడ భాషలోనూ, ప్రాంతీయ భాషలలోనూ దివ్య ప్రబంధ వ్యాఖ్యానాలకు అనువాదాలను, వివరణలను అందజేశారు.

శ్రీరంగ దివ్యక్షేత్రానికి సమీపంలో ఉండే పుత్తూరు అగ్రహారంలో నివసించినవారు, పలు సంప్రదాయ గ్రందాలకు, పూర్వాచార్య వ్యాఖ్యానాలకు ద్రావిడంలో వివరణలను అనుగ్రహించినవారు, చిరకాలం " శ్రీవైష్ణవ సుదర్శనమ్" అనే తమిళ మాసపత్రికను నిర్వహించిన ప్రసిద్ధ విద్వాంసులు అయిన కీర్తిమూర్తులు, ఉ. వే. శ్రీమాన్ ఎస్. కృష్ణస్వామి అయ్యంగార్ స్వామివారు నాచ్చియార్ తిరుమొழி ప్రబంధానికి పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన మణిప్రవాళ వ్యాఖ్యానానికి సులభమైన శైలిలో ద్రావిడంలో వివరణను అనుగ్రహించారు. ప్రస్తుత ఆంధ్ర వివరణం వారి ద్రావిడ వివరణను అనుసరించి సిద్ధం చేయబడింది. తమ గ్రంథాలను అంధ్రీకరించడానికి ఉదారంగా అంగీకారాన్ని తెలిపిన వారి సన్నిధిలో దాసుడు కృతజ్ఞతాపూర్వకంగా ప్రణవిల్లుతున్నాడు.

ఈ అనువాదం, కీర్తి మూర్తులు ఉ. వే. శ్రీమాన్ తూపురాణి ఉడైయవర్లుస్వామి వారి పవిత్రస్మృతి చిహ్నంగా వారి కుటుంబ సభ్యుల, వారి శిష్య బృందం, ఆత్మీయుల కైంకర్య రూపంగా ముద్రింపబడుతున్నది. శ్రీమాన్ తూపురాణి ఉడైయవర్లుస్వామివారు ఆంధ్రదేశంలో ప్రసిద్ధి చెందిన ఉభయ వేదాంత విద్వాంసులు కులపతులు, ఉ. వే. శ్రీమాన్ తె. కం. గోపాలచార్య స్వామివారి దేహ సంబంధాన్ని ,ఆత్మ సంబంధాన్ని పొందిన భాగ్యవంతులు. శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామివారి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారుల కటాక్షాలకు పాత్రమైనవారు. భగవద్విషయాన్ని ఎన్నో పర్యాయాలు ప్రవచనం చేసిన అదృష్టశాలి. విశేషించి నా విషయం సౌహార్ధాన్ని , సౌభ్రాత్రాన్ని కలిగినవారు. ఈ మహనీయుల కైంకర్యంలో ఈ విధంగా ఈ వ్యాఖ్యానానికి ఆంధ్రానువాదాన్ని చేయడం ద్వారా అన్వయించుకోగలగడం నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తున్నది. నాకు ఈ అవకాశాన్ని ఇచ్చిన అందరికీ అనేక కృతజ్ఞతలను సమర్పించుకుంటున్నాను. ఈ అనువాదంలో ఉండే లోటుపాట్లను సహృదయ పాఠకులు మన్నించి, గుణాలను స్వీకరిస్తారని నమ్ముతున్నాను. ఈ గ్రంథం ముద్రణకు తగినట్లు సిద్ధం చేయడంలో సహకరించిన శ్రీమాన్ కేశవ అయ్యంగార్ స్వామివారికి అనేక కృతజ్ఞతలను తెలుపుకుంటూ, అనేక మంగళాశాసనాలను చేస్తున్నాను. స్వస్తి.

భాగవతదాసుడు,

ఈయుణ్ణి అழగ శింగరాచార్యులు

★★★★★

నాయ్ చ్చియార్ తిరుమొళిలో నవవిధభక్తిప్రకారాలు

(**ఈయుణ్ణి అళగ శింగరాచార్యులు**)

శ్రీప్రహ్లాదాళ్వాన్ హిరణ్యకశిపునితో చెప్పిన విషయాలలో ఒకటి ఏమంటే, భగవంతుని విషయంలో భక్తునకు ఉండే భక్తి తొమ్మిది విధాలుగా ఉంటుంది– అని. వీటికి నవవిధ భక్తులు అని పేరు. ఇవి క్రమంగా శ్రవణం, కీర్తనం, స్మరణం, పాదసేవనం, అర్చనం, వందనం, దాస్యం, సఖ్యం, ఆత్మ నివేదనం– అనేవి.

ఈ నవవిధాలయిన భక్తి ప్రకారాలను ఆళ్వార్లు తమ దివ్యప్రబంధాలలోని పాశురాలలో వ్యక్తం చేశారు. అళ్వార్లకు అందరికీ ఏకైక జ్ఞానపుత్రిక అయిన ఆండాళ్ అనుగ్రహించిన పాశురాలు నాయకీ భావంలో పాడబడినవి. ఈ మనోభావంతో ఆ గోదాదేవి పాడిన పాశురాలలో తొమ్మిది విధాలైన భక్తులు ఏ విధంగా వ్యక్తం అయ్యాయి? అనే విషయాన్ని గమనించి చూద్దాం.

తిరుప్పావై, నాయ్ చ్చియార్ తిరుమొళి– అనే రెండు ప్రబంధాలలోనూ ఈ తొమ్మిది విధాలైన భక్తి ప్రకారాలను దర్శించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం, నాయ్ చ్చియార్ తిరుమొళి అనే, గోదాదేవి అనుగ్రహించిన రెండవ ప్రబంధంలో ఉండే సూక్తులను పురస్కరించుకొని, ఈ తొమ్మిది విధాలయిన భక్తిప్రకారాలు ఏ విధంగా వ్యక్తం అవుతున్నాయో సంగ్రహంగా గమనిద్దాం.

1) **శ్రవణం** – భగవంతుని తిరునామాలు, కథలు మొదలైనవానిని చెవులారా ఆలకించడం.

(నాయ్ చ్చియార్ తిరుమొళి–5–4)

ఎన్బురుగి ఇనవేల్ నెడుకణ్ గళ్ ఇమై పొరుందా పల నాళుమ్,
తున్బ క్కడల్ పుక్కు వైకుందన్ ఎన్బదోర్ తోణి పెఱాదుళల్ కిన్ఱేన్,
అన్బుడైయారై ప్పిరివుఱు నోయ్ అదు నీయుమ్ అఱిది కుయిలే!,
పొన్ పురై మేని క్కురుళ క్కొడియుడై ప్పుణ్ణియనై వర క్కూవాయ్.

"భక్తులను రక్షించడం కోసం పతాకాన్ని నిలిపినవాడై, మోక్షోపాయరూపుడై ఉండే వైకుంఠుడు ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూయాలి" అని ఇందులో గోదాదేవి కోకిలతో అంటున్నది.

ఓ కోకిలా! ఎముకలు కూడా కరిగి పోవడమే కాకుండా, వేలాయుధ సమూహంవంటి, పదునైన, విశాలమైన నా కన్నులు దుఃఖం తీరి మూసుకోవడం లేదు. చిరకాలంగా విరహ దుఃఖమనే సముద్రంలో మునిగి, శ్రీవైకుంఠనాథుడనే ఒక నావను నేను పొందలేక, ఆ సముద్రంలోపలనే తల్లడిల్లుతూ ఉన్నాను. ఇష్టమైనవారు దూరం కావడంవల్ల కలిగే దుఃఖాన్ని నీవు కూడా తెలిసినదానవే కదా. బంగారంవలె ఆకర్షణీయమైన తిరుమేనిని కలవాడై, గరుడుని ధ్వజంగా కలవాడై, ధర్మమే మూర్తీభవించినట్లున్నాడు –అని చెప్పబడే శ్రీకృష్ణుడు ఇక్కడకు వచ్చేటట్లు నీవు కూయాలి.

పెరియాళ్వారుల నోటి ద్వారా శ్రీకృష్ణుని కథలను విని పెరిగినది, గోదాదేవి. ఈ గోదాదేవి ఇంటిలోని పెంపుడు చిలుక కూడా ఆమె ద్వారా శ్రీకృష్ణుని నామాలను విని పాడుతుంది. గూటిలో పెట్టినప్పుడు ఆ చిలుక ఇంకా అనేకమార్లు గోవింద నామాన్ని పాడుతుంది. తనకు ఆహారాన్ని పెట్టకపోతే భగవంతుని తిరునామాలను ఇంకా బాగా నొక్కి నొక్కి పాడుతుంది. ఈ తిరునామ సంకీర్తనాన్ని అంతటినీ గోదాదేవి వింటుంది. ఈ విధంగా తన శ్రవణేంద్రియ సంపదను భగవంతుని విషయంలో వినియోగించిన గోదాదేవి కోకిలనుకూడా ఆ స్వామి తిరునామాలను పాడమని ఇక్కడ అడుగుతున్నది.

2) **కీర్తనం** –భగవంతుని తిరునామాలను, కథలను నోరార పాడడం

నాయ్ చ్చియార్ తిరుమొళి–(8–3)

ఒళి వణ్ణమ్ వళై శిందై ఉఱుక్కత్తోడివై ఎల్లామ్,
ఎళిమైయాల్ ఇట్టెన్నై ఈడళియ పోయినవాల్,
కుళిర్ అరువి వేంగడత్తు ఎన్ గోవిందన్ గుణమ్ పాడి,
అళియత్త మేగంగాళ్! ఆవి కాత్తిరుప్పీనే

"అన్నిటినీ పోగొట్టుకున్న స్థితిలో ఉండే నేను స్వామితిరునామ సంకీర్తనంతో ప్రాణాలను ధరించడం సాధ్యమా ?" అని గోదాదేవి అంటున్నది.

కరుణించే స్వభావాన్ని కలిగిన మేఘాలలారా !నా దేహంలోని కాంతి, వర్ణం, గాజులు, మనసు, నిద్ర– అనే ఇవి అన్నీ నా దైన్యమే కారణంగా నన్ను ఉపేక్షించి

నేను బలాన్ని కోల్పోయేటట్లు నన్ను విడిచి వెళ్లిపోయాయే! అయ్యో! చల్లని కొండవాగులు ప్రవహించే తిరుమలలో వేంచేసి ఉన్న నా శ్రీకృష్ణుని కళ్యాణ గుణాలను నోరార కీర్తిస్తూ, ఆ పాటే ధారకంగా నా ప్రాణాలను రక్షించుకోవడం నాకు సాధ్యమా?

భగవంతుని విశ్లేషంతో చాలా బాధ పడుతున్న తన స్థితిని శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో విజ్ఞాపన చేయమని ఇక్కడ మేఘాలను దూతలుగా పంపుతున్నది, గోదాదేవి, ఈ దశకంలో. తిరుప్పావై ప్రబంధంలో "పరమన్ ఆడి పాడి, ఉత్తమన్ పేర్ పాడి" అని ఈ విధంగా భగవంతుని తిరునామాలను కీర్తన చేయమని మనకు సందేశాన్ని ఇచ్చిన గోదాదేవి, ఆ విధంగా తాను చేసినప్పటికీ కూడా నా ప్రాణం నిలుస్తుందా? అని ఇక్కడ సందేహాన్ని పొందుతున్నది.

3) **స్మరణం**– భగవంతుని తిరునామాలను, కథలను మనసారా భావించడం.

నాయ్ చ్చియార్ తిరుమొళి–(14–4)

కార్ త్తణ్ కమల క్కణ్ ఎన్నుమ్ నెడుమ్ కయిఱు పడుత్తు,
ఎన్నై ఈర్త్తు క్కొణ్డు విళైయాడుమ్ ఈశన్ తన్నై క్కణ్డీరే?,
పోర్త్త ముత్తిన్ కుప్పాయ ప్పుగర్ మాల్ యానై క్కన్నే పోల్,
వేర్త్తు నిన్ఱు విళైయాడ విరుందావనత్తే కణ్డోమే.

అలంకరింపబడిన ఏనుగును గున్నవలె ఉండేవాడు, స్వేదాన్ని కలవాడై ఆడుకునే శ్రీకృష్ణుని శ్రీ బృందావనంలో దర్శించాము –అని అంటున్నది.

నల్లని మేఘంలో చల్లని తామర పూచినట్లుగా ఉండే కన్నులు అనే పెద్ద పాశంలో నన్ను బంధించి, తాను పోయే చోటికి అంతటికి నా మనస్సును లాగుకునిపోయే స్వామిని దర్శించారా?

దట్టంగా ముత్యాలతో పొదిగిన కంచుకాన్ని కలిగినదై, తేజస్సును కలిగినదైన పెద్ద ఏనుగున్నవలె ఉండేవాడు, స్వేదజలాన్ని కలవాడై ఆడుతూ ఉండే శ్రీకృష్ణుని బృందావనంలో దర్శించాము.

ఇది చాలా రసవంతమైన దశకం. ఈ దశకంలో గోదాదేవి రెండు వేరు వేరు గోపికల దశలను పొంది పలుకుతున్నది. ఒక విధమైన దశను కలిగిన గోపికలు

శ్రీకృష్ణుని అన్వేషిస్తూ,"ఆ స్వామిని ఎక్కడైనా చూశారా? "అని అడుగుతున్నారు. వేరొక విధమైన దశను పొందిన గోపికలు శ్రీకృష్ణుని చూసినవారై, "బృందావనంలో మేము ఆ స్వామిని చూశాము" అని అంటున్నారు. పెరియాళ్వారులతో పాటు మిగిలిన ఆళ్వారులు కూడా ఇటువంటి పాశురాలను అనుగ్రహించారు.
ఈ పాశురంలో "ఎన్నై "అనే పదానికి "నా మనస్సును "అని వ్యాఖ్యానం చేయడం గమనించాలి.

4) **పాద సేవనం**– భగవంతుని పాదాలకు సేవను చేయడం

నాయ్ చ్చియార్ తిరుమొళి–(1–8)

మాశుడై ఉడంబొడు తలై ఉలఱి వాయ్ ప్పుఱమ్ వెళుత్తొరు పోదుముణ్డు,
తేశుడై త్తిఱల్ ఉడై క్కామ దేవా! నోట్కిన్ఱ నోన్బినై క్కుఱిక్కొళ్ కణ్డాయ్,
పేశువదొన్ఱుణ్డు ఇంగు ఎమ్బెమాన్! పెణ్మైయై త్తలైయుడై త్తాక్కుమ్ వణ్ణమ్,
కేశవ నంబియై క్కాల్ పిడిప్పాళ్ఎన్నుమ్ ఇప్పేఱెనక్కరుళ్ కణ్డాయ్.

"స్వరూపానికి తగిన భగవంతుని శ్రీపాదకైంకర్యాన్ని చేసే అదృష్టాన్ని నాకు కలిగించాలి" అని ఇందులో గోదాదేవి వేడుతున్నది.

ఒకరికి ఇంకొకరు దూరమైన ప్రేయసీ ప్రియులను కలపడంలో సామర్థ్యం కలిగిన కామదేవా! మలినమైన శరీరంతో చెల్లా చెదరుగా ఉండే కేశపాశంతో, ఒక్కపొద్దులు చేసి పాలిపోయిన పెదవులతో నేను ఆచరించే ఈ వ్రత విధానాన్ని వినుు. నేను నిన్ను కోరేది ఒక్కటే. ఈ లోకంలో ఈమె కేశవుని శ్రీపాదాలను సంవాహనం చేయడమనే పరమ పురుషార్థంలో ఆసక్తిని కలిగినది–అనే పేరు నాకు కలిగేటట్లు అనుగ్రహించు.

పురుషోత్తముడైన భగవంతునికే తన ఆత్మను పెండ్లికూతురిగా సమర్పించే భగవద్భక్తులకు భగవంతుని తప్ప వేరొక దైవాన్ని సేవించడం అనేది లేదు. శరణాగతి మాత్రమే మార్గంగా కలిగిన శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఉపాసనను చేసే మార్గాన్ని అనుసరించడం కూడా లేదు.

అయినప్పటికీ, ఆ భగవంతుని కు తన ఆత్మను పెళ్లికూతురిగా సమర్పించాలని గోదాదేవి మన్మథుని ఉపాసన చేస్తున్నది. "భగవంతుని ఇంకా

పొందలేదే!" అనే ఆమె పొందే అత్యంతమైన ఆర్తిప్రకారం ఆమెను ఆ విధంగా చేసేటట్లు ప్రేరేపిస్తున్నది.

5) **అర్చనం**– భగవంతుని పూలు మొదలైన ద్రవ్యాలతో అర్చించి, ఆరాధించడం.

తిరుప్పావై తనియన్ పాశురాలు

అన్న వయల్ పుదువై ఆండాళ్ అరంగర్ క్కు
పన్ను తిరుప్పావై పల్ పదియుమ్– ఇన్నిశైయాల్
పాడి కొడుత్తాళ్ నఱ్ఱామాలై పూమాలై
శూడి క్కొడుత్తాళై చ్చొల్లు.

హంసలు సంచరించే పొలాలను కలిగిన శ్రీవిల్లి పుత్తూరు అనే క్షేత్రంలో పుట్టిన గోదాదేవి నిత్యం అనుసంధించదగినది, అనేక పాశురాలను కలిగినది, విలక్షణమైన పాటల రూపంలో ఉన్నది అయిన తిరుప్పావై దివ్య ప్రబంధాన్ని రచించి శ్రీరంగనాథునకు సమర్పించడమే కాక తాను ముందుగా ధరించిన పూలమాలికను శ్రీవిల్లి పుత్తూరులోని వటపత్ర శాయి స్వామికి సమర్పించినది. ఆ గోదాదేవి శుభనామాన్ని, ఓ మనసా! అనుసంధించు.

శూడి క్కొడుత్త శుడర్ క్కొడియే తొల్వాపై
పాడి అరుళ వల్ల పల్ వళైయాయ్– నాడి నీ
వేంగడవఱ్కు ఎన్నై విది ఎన్ట ఇమ్మాఱ్ఱమ్
నామ్ కడవా వణ్ణమే నల్ గు.

పూలమాలికను తాను ముందుగా అలంకరించుకొని, ఆ తరువాత ఆ మాలికను వటపత్రశాయి స్వామికి సమర్పించిన, ప్రకాశించే బంగారు తీగ వంటి ఓ గోదాదేవీ! అనాది అయిన ధనుర్మాస వ్రతాన్ని ఆచరించి, దానిని దివ్యప్రబంధంగా గానం చేసిన, పలు కంకణాలను ధరించిన తల్లీ! నీవు కామదేవుని ఉద్దేశించి " ఓ కామదేవా! నీవు తగిన ఉపాయాన్ని వెదకి, నేను శ్రీ వేంకటేశ్వరునకు పత్నిని అయ్యేటట్లు చేయాలి" అని ప్రార్థించిన తీరును మేము కూడా అతిక్రమించకుండా ఉండేటట్లుగాను,, నీకు ఉండే అతిమాత్రమైన భగవత్ప్రావణ్యం మాకు కూడా కలిగేటట్లుగాను అనుగ్రహించాలి.

గోదాదేవికి, పుష్పాలకు, పూలమాలికలకు మధ్య ఉండే సంబంధాన్ని ఆమె పాశురాలు పురస్కరించుకునే తెలియాలికదా!

తిరుప్పావై ప్రబంధంలో "తూయోమాయ్ వందు తూమలర్ తూవి తొ౧ుదు" (పరిశుద్ధమైన మనసును కలిగినవారమై వచ్చి,పవిత్రమైన పూలను సమర్పించి నమస్కరించి) అని మనకు మార్గ ప్రదర్శనం చేసిన గోదాదేవి భగవంతునకు పరిశుద్ధమైన పూలమాలికలను సమర్పించే పెరియాళ్వారుల ప్రియ పుత్రికయై, వారి తిరు నందనవనంలో తులసీవనంలో తులసివృక్షం మూలంలో అవతరించి భగవంతుని కోసమని కూర్చిన పూలమాలికను ముడుచుకొని ప్రకాశించే తీగ వంటిది కదా.

అందుచేత, ఇక్కడ మాత్రం ఆమె అనుగ్రహించిన పాశురాల కంటే, ఆమెను కీర్తించే ఈ తనియన్ పాశురాలను ఉదాహరించడమే యుక్త మైనది, కనుక, వాటిని ప్రమాణంగా ఉదాహరించడం జరిగినది. గోదాదేవియే భగవంతుడు అలంకరించుకునే ఒక సాటి లేని మేటి పూలమాలిక.

శ్రీ పొన్నడిక్కాల్ జీయర్ అనుగ్రహించిన నాచ్చియార్ తిరుమొ౧ి తనియన్ పాశురం " శె౧ుమ్ కీ౪ల్ మేల్ మాలైత్తొడై తెన్నరంగర్ క్కు ఈయుమ్ మదిప్పుడైయ శోలై క్కిళి" అని ఆమెను కీర్తిస్తున్నది.గోదాదేవి వా౧ి త్తిరునామంకూడా " ఉయర్ అరంగర్ క్కే కణ్ణి ఉగందళిత్తాళ్ వా౧ియే" (ఉన్నతుడైన శ్రీ రంగనాథునకు పూలమాలికను సంతోషంగా సమర్పించిన గోదాదేవికి మంగళం) అని కీర్తిస్తున్నది. " అరంగర్ మౌళి శూ౪ికిన్ఱ మాలైయై శూడి క్కొడుత్తవళ్ తొల్లరుళాల్ వా౪ికిన్ఱ వళ్ళల్" (? శ్రీ రంగనాథుని శిరస్సులో సమర్పించవలసిన పూలమాలికను తాను ముందుగా కేశపాశంలో అలంకరించుకొని, ఆ తరువాత శ్రీరంగనాథునకు ఇచ్చిన గోదాదేవి యొక్క స్వాభావికమైన దివ్య కృపా ప్రభావంచేత సుఖంగా ప్రకాశిస్తున్న,ఉదారమైన స్వభావం కలిగినవారు) అని కదా ఇరామానుశ నూ౾ాన్ది కూడా భగవద్రామానుజులను కీర్తించి పలుకుతున్నది.

6) **వందనం** – భగవంతునకు వినయంగా నమస్కరించడం

నాయ్ చ్చియార్ తిరుమొழి–(10–6)

కణ మా మయిల్ కాళ్! కణ్ణ పిరాన్ తిరుక్కోలమ్ పోన్ను,
అణి మా నడమ్ పయిన్ఱాడుగిన్ఱీర్క్కు అడి వీழ్గిన్ఱేన్,,
పణమ్ ఆడరవణై ప్పుఱ్ఱుల కాలముమ్ పళ్ళి కొళ్,
మణవాళర్ నమ్మై వైత్త పరిశిదు కాణ్మినే.

తనను బాధిస్తూ నాట్యం చేసే నెమళ్ళ పాదాలపై పడి, గోదాదేవి "భగవంతుడు నన్ను రక్షించే అందాన్ని చూచారా?" అని అంటున్నది.

గుంపులు గుంపులుగా ఉండే గొప్ప నెమళ్ళలారా! శ్రీకృష్ణుని అందమైన రూపంవంటి రూపాన్ని కలిగినవారై, అందంగా గొప్ప నాట్యం నేర్చి, ఆ నాట్యాన్ని ఆడుతున్న మీ పాదాలలో నమస్కరిస్తున్నాను. ఈ ఆటను నిలుపండి. తన పడగలను ఎత్తి ఆడుతున్న ఆదిశేషుడనే పడుకలో కాలం ఉన్నంత సేపు పరుండి ఉండే అందమైన వరుడైన స్వామి నాకు కలిగించిన గొప్పతనం ఈ విధంగా మీ కాలిలో పడేటట్లుగా అయినది.

కొన్ని నెమళ్లు గుంపులు గుంపులుగా కలసి ఆడడాన్ని చూచి శ్రీకృష్ణుని స్మరించి, మనసులో బాధపడే గోదాదేవి ఈ పాశురంలో తన బాధను వాటితో తెలుపుతున్నది.

"గుంపులుగా ఉండే గొప్ప నెమళ్ళలారా! శ్రీకృష్ణుని నల్లని వర్ణాన్ని కల మీరు మీ అందమైన నాట్యాలను దయచేసి నిలపండి. మీ పాదాలలో పడి నమస్కరిస్తున్నాను" అని గోదాదేవి పలుకుతున్నది.

అప్పుడు ఆ నెమళ్ళు "పెరియాళ్వారుల ప్రియ పుత్రికా! గోదాదేవీ! నీ చరణాలలో కదా మేము పడి నమస్కరించాలి! నీవు మా పాదాలలో పడవచ్చునా?" అని అడుగుతున్నట్లుగా భావించి, విరహక్లేశంతో ఇంకా ఈ విధంగా పలుకుతున్నది. "వేయి శిరస్సులను కలిగిన ఆదిశేషునినుండి పలు విధాలైన కైంకర్యాలను స్వీకరించి, ఆనందింప చేసే శ్రీరంగనాథుడు దాసురాలను అయిన నన్ను ఈ విధంగా ఈ స్థితిలో ఉంచినందువల్ల నేను మీ పాదాలలో వాలడం తప్ప, వేరు గతి నాకుఉన్నదా?"

అని అంటున్నది, గోదాదేవి. గోదాదేవినాయకీ మనోభావంలో నవవిధ భక్తుల స్వారస్యం చక్కగా వ్యక్తం అవుతున్నది– అనేదానికి ఇది ఒక సాక్ష్యం.

7) **దాస్యం**– "నేను భగవంతుని దాసుడను" అని తెలుసుకొని, దాస్యాన్ని చేయడం.

నాయ్ చ్చియార్ తిరుమొళి–(9–6, 9–7)

నాఱు నఱుమ్ పొళిల్ మాలిరుమ్ శోలై నంబిక్కు, నాన్
నూఱు తడావిల్ వెణ్ణెయ్ వాయ్ నేర్ న్దు పరావి వైత్తేన్,
నూఱు తడా నిత్తైంద అక్కార అడిశిల్ శొన్నేన్,
ఏఱు తిరు ఉడైయాన్ ఇన్ను వందివై కొళ్ళుంగొలో?

నూరు గంగాళాల వెన్నను, నూరు గంగాళాల పాయసాన్ని సుందరబాహు స్వామికి సమర్పించాలని గోదాదేవి ఆశపడుతున్నది. అనంతర కాలంలో ఈ ఆశను పూర్తిచేసి, శ్రీవిల్లిపుత్తూరు క్షేత్రానికి శ్రీరామానుజులు వచ్చినప్పుడు ఆనందంతో వారిని "కోయిలణ్ణా!" అని వారిని గోదాదేవి సంబోధిస్తూ పొగడింది– అనే వృత్తాంతం సుప్రసిద్ధం.

సువాసన నిండుగా ఉండే తోటలు పరిమళిస్తూ ఉన్న తిరుమాలిరుమ్ శోలై క్షేత్రంలో ఉన్న గుణపూర్ణునకు నేను నూరు కటాహాల నిండుగా వెన్నను నోటితో పల్కి సమర్పించాను. అంతేకాక, నూరు గంగాళాల నిండుగా అక్కార అడిశిల్ అనే పాయసాన్ని నోటితో సమర్పించాను. ఈ వెన్నను, పాయసాన్ని, క్రమక్రమంగా వృద్ధి చెందే సంపదను కలవాడైన సుందరబాహు స్వామి ఇప్పుడు వచ్చి అనుగ్రహిస్తాడా? (స్వీకరిస్తాడా?)

ఇన్ను వందు ఇత్తనైయుమ్ అముదు శెయ్ దిడ ప్పెఱిల్, నాన్
ఒన్ను నూఱాయిరమా క్కొడుత్తు ప్పిన్నుమాళుమ్ శెయ్ వన్,
తెన్ఱల్ మణమ్ కమళ్ంగుమ్ తిరుమాలిరుమ్ శోలై తన్నుళ్
నిన్ఱ పిరాన్ అడియేన్ మనత్తే వందు నేర్ పడిలే.

నేను సమర్పించిన నూరు గంగాళాల వెన్నను, నూరు గంగాళాల పాయసాన్ని స్వామి ఆరగిస్తే, ఇంకా నూరు వేలుగా సమర్పించి కైంకర్యాన్ని చేస్తాను– అని అంటున్నది.

మలయ మారుతం సువాసనను గ్రహించి వీచే తిరుమాలిరుమ్ శోలైలో వేంచేసి ఉండే స్వామి అయిన సుందరబాహు స్వామి ఈనాడు ఇక్కడకు వచ్చి, నూరు గంగాళాల నిండుగా వెన్నను, అకార ఆడిశిల్ పాయసాన్ని ఆరగించినట్లయితే, నేను అంత మాత్రంతోనే ఆగకుండా, నా హృదయంలోనే నిత్య వాసం చేయగలిగితే, నేను ఒకటికి నూరు వేల రెట్లు సమర్పించి, ఆ తరువాత కూడా సకలవిధసేవలను స్వామికి చేస్తాను.

సువాసన పరిమళించే తోటలను కలిగిన తిరుమాలిరుమ్ శోలై క్షేత్రంలో నెలకొని ఉండే సుందర బాహు స్వామికి నూరు గంగాళాల వెన్నను నేను చేతులారా సమర్పించాలనే ఆశ నాకు ఉన్నప్పటికీ, నా విరహక్లేశం వల్ల కలిగిన శ్రమ చేత నేనిప్పుడు ఆ పనిని చేయలేకపోయినా, నోరారా దానిని సమర్పిస్తున్నాను. పూర్వం శ్రీరామావతారంలో అత్రిముని ఆశ్రమం వాకిలిలో నిలచి ఉండి, "నేను శ్రీరాముడను, ఈమె సీత, ఇతడు లక్ష్మణుడు" అని అన్నాడుకదా. ఆ విధంగానే, దినాలు గడిచే కొద్ది అభివృద్ధి చెందే సంపదను కలిగిన తిరుమాలిరుమ్ శోలై క్షేత్రంలోని సుందరబాహు స్వామి ఈనాడు నా గుడిసెకు వచ్చి ప్రత్యక్షమై, నేను సమర్పించే వీటిని ఆరగించాలని అభిప్రాయపడతాడా? అని ఇందులో గోదాదేవి. ప్రశ్నిస్తున్నది.

8)సఖ్యమ్– భగవంతుని విషయంలో హృదయపూర్వకమైన స్నేహభావాన్ని కలిగి ఉండడం.

నాయ్ చ్చియార్ తిరుమొళి (2–5)

వెళ్ళై నుణ్ మణల్ కొణ్డు శిట్రిల్ విశిత్తిరప్పడ వీది వాయ్
తెళ్ళి నాంగళ్ ఇழైత్త కోలమ్ అழిత్తియాగిలుమ్ ఉందన్ మేల్.
ఉళ్ళమోడి ఉరుగల్ అల్లాల్ ఉరోడమ్ ఒన్నుమిలోమ్ కణ్డాయ్,
కళ్ళ మాదవా! కేశవా! ఉన్ ముగత్తన కణ్గళ్ అల్లవే.

"కృష్ణా!నీవు మా బొమ్మరిళ్ళను పడగొట్టినా,, మా మనస్సు నీ విషయంలో కోపపడడం లేదు, ప్రేమనే కలిగి ఉన్నది" –అని ఇక్కడ గోదాదేవి అంటున్నది.

కపట చేష్టలను చేసే మాధవా! కేశవా! మేము తెల్లని, సన్నని ఇసుకను తీసుకొని వీథులలో అందరూ ఆశ్చర్యపడేటట్లు చక్కగా కట్టుకున్న బొమ్మరిళ్ళు అనే అలంకారాన్ని నీవు పాడు చేసినప్పటికీ, దానివల్ల మా మనస్సు నీ పట్ల ఇంకా ద్రవిస్తున్నదే తప్ప, నీపై రోషం కొంచెం కూడా మేము పొందడం లేదు. నీ ముఖంలో ఉన్నవి కన్నులేనా?

ఇంతకంటే ఎక్కువగా ఎవరు ఏ విధంగా శ్రీకృష్ణుని విషయంలో స్నేహభావాన్ని ప్రదర్శించగలరు? ఎంతో స్నేహం ఉంటే కదా,ఈ విధంగా ప్రశ్నించగలరు.

గోపకన్యలు తెల్లని ఇసుకను తీసుకొని వచ్చి, పిచ్చుక గూళ్లను కట్టి ఆడుకుంటారు. దీనికి " శిற்றில் இழைத்தல் ",అని పేరు. "నాపై కంటే కూడా వీరికి ఈ పిచ్చుక గూళ్ళ పైననే ఎక్కువ ప్రేమ ఉన్నదా?" అని శ్రీకృష్ణునకు కోపం వచ్చింది. అందువల్ల అతడు పిచ్చుక గూళ్లను గోపికలు కష్టపడి కట్టి ముగించే వరకు వేచి ఉండి,ఆ తరువాత వాటిని తన కాలితో కూలగొట్టి.చిదిమి వేశాడు. అప్పుడు గోపికలు "కృష్ణా! కృష్ణా! ఆ విధంగా చేయవద్దు, చేయవద్దు" అని వేడుతున్నారు.

ఇటువంటి గోపికలలో ఒక గోపికగా మారి, గోదాదేవి ఈ దశకాన్ని పాడుతున్నది.

9) ఆత్మనివేదనమ్– "నా ఆత్మతో పాటు అన్ని భగవంతుని సొత్తు" అని తెలుసుకొని, పూర్ణంగా తనను భగవంతునకు సమర్పించుకోవడం.

నాయ్ చ్చియార్ తిరుమొழி (6–6, 6–8)

మత్తళమ్ కొట్ట వరి శంగమ్ నిన్ఱూద,
ముత్తుడై త్తామ్ నిత్తై తాழ్ந్త పందట్కీழ్,
మైత్తునన్ నంబి మదుశూదన్ వందెన్నై,
కైత్తలమ్ పற்ற క్కనా క్కణ్డేన్ తోழీ! నాన్

"మధుసూదనుడు నన్ను పాణిగ్రహణం చేసిన రీతిని నేను కలలో కన్నాను"– అని అంటున్నది.

చెలీ! మద్దెలలను వాయించగా, సుడులను కల శంఖాలు చాలాసేపు మోగగా, నాతో మేనరికపు చుట్టారికాన్ని కలిగినవాడై, పరిపూర్ణుడైన శ్రీకృష్ణుడు ముత్యాలతో పొదిగిన మాలికల సమూహాలు వేలాడదీయబడిన పెండ్లి పందిరి కిందకు వచ్చి, నన్ను పాణిగ్రహణం చేసుకోవడాన్ని నేను కలలో చూశాను.

ఇమ్మైక్కుమ్ ఏழ్ழైழ్ పిఱవిక్కుమ్ పట్రావాన్,
నమ్మై ఉడైయవన్ నారాయణన్ నంబి,
శెమ్మై ఉడైయ తిరుక్కైయాల్ తాళ్ పట్రి,
అమ్మి మిదిక్క క్కనా క్కణ్డేన్ తోழీ! నాన్

అగ్నిని ప్రదక్షిణంచేసిన తరువాత సన్నికల్లును తొక్కడం అనే అశ్మారోహణక్రియను కూడా నేను కలలో చూచి ఆనందించాను– అని అంటున్నది.

సఖీ! ఈ జన్మకు, రాబోయే ఏడేడు జన్మలకు శరణ్యుడై ఉండేవాడై, మనకు శేషియై, సకలకళ్యాణగుణాలతో పరిపూర్ణుడై, నారాయణుడైన కృష్ణుడు నా కాలిని పట్టుకొని సన్నికల్లుపై చ పెట్టినట్లు నేను కలగన్నాను.

భగవానుడు తనను వివాహం చేసుకొనే సన్నివేశాన్ని స్వప్నంలో దర్శించిన గోదాదేవి, దానిని తన చెలికెత్తెతో చెప్పే చాలా ప్రసిద్ధమైన దశకం ఇది. పరమాత్మ యొక్క, జీవాత్మ యొక్క ఆత్మవివాహంగా చెప్పబడే దశకం ఇది.

మధుసూదనుడు అనే నామానికి "మధువు మొదలైన శత్రువులను నశింపచేసినవాడు" అని అర్థం.

ఆరవ పాశురంలో "మైత్తునన్ నంబి మదుశూదన్ వందెన్నై కైత్తలమ్ పట్రి" (నా మేనమామ కుమారుడు మధుసూదనుడు వచ్చి నన్ను పాణిగ్రహణం చేసుకున్న) అని అనడంలో భావాన్ని వ్యాఖ్యాత ఈ విధంగా వివరిస్తున్నారు. " ఒకవేళ వేరు ఎవరైనా – "నేను మేనమామ కుమారుడను" అని సంబంధాన్ని పలికి నా చేయి పట్టుకోవాలని చూసినా, నాకు చెందినది అని అన్నా, వారిని నశింప చేసి, తానే వచ్చినా పాణిగ్రహణాన్ని చేయగలిగినవాడు –అని దీని భావం. రుక్మిణీ దేవిని శ్రీకృష్ణుడు ఈ విధంగానే కదా, వివాహం చేసుకున్నాడు.

ఎనిమిదవ పాశురంలో "నమ్మై ఉడైయవన్ నారాయణన్ నంబి" (మన స్వామి గుణపూర్ణుడైన నారాయణుడు) అని గోదాదేవి అంటున్నది. సమస్త

జీవులకలో నివసించేవాడు, సమస్త జీవులకు ఉపాయమై ఉండేవాడు కదా నారాయణుడు అనబడుతున్నాడు అందువల్లనే,"నమ్మై ఉడైయవన్ నారాయణన్" – అంటే, మన ఆత్మలకు సొత్తుదారుడైన నారాయణుడు– అని అంటున్నది. అతడు వచ్చి మనలను, అంటే,మన ఆత్మలను స్వీకరించిన తరువాత, అతడు స్వామి అనే భావాన్ని మరచిపోయి,ప్రేమను పంచడంలో అతడే ముందు ఉంటాడు.అతడే మన పాదాలను ప్రేమతో పట్టుకుంటాడు –అని ఇక్కడ సరసమైన అర్థం. ఇటువంటి సన్నివేశం తన విషయంలో సంభవించాలనే ఆశతో గోదాదేవి ఈ విధంగా పలుకుతున్నది.

ఉపసంహారం

భగవద్రామానుజులు నాచ్చియార్ తిరుమొழி ప్రబంధంలోని గొప్పతనాన్ని గూర్చి వ్యక్తం చేసేటప్పుడు –" ఇవి గోదాదేవి మాత్రమే పాడవలసిన దశకాలు, ఇవి గోదాదేవి మాత్రమే వినవలసిన దశకాలు. వేరు ఎవ్వరు కూడా అంతటి శుచిని కలిగినవారు కారు" అని అనేవారట.

అంతటి గొప్ప వైలక్షణ్యాన్ని కలిగిన నాచ్చియార్ తిరుమొழி సూక్తులద్వారా నవవిధ భక్తులను నిరూపించడాన్ని, గోదాదేవికి కల సహజమైన నాయకీమనోభావంలో అవి మిక్కిలిగా ప్రకాశించడాన్ని గమనించాము. స్వస్తి

★★★★★

ఓమ్ అస్మద్గురుభ్యో నమః

కౌశికాన్వయ సంజాతం వేంకటార్య తనూభవమ్ |

వేదాంతాచార్య సచ్ఛిష్యం ఉడయవర్లు గురుం భజే ||

శ్రీమాన్ ఉ.. వే. తూపురాణి ఉడైయవర్ స్వామివారంటే తెలియనివారు లేరు. "జ్ఞానమనుట్టానమ్ ఉడైయనాన గురువై అడైందక్కాల్" అన్నట్టుగా జ్ఞాన, అనుష్ఠానములు కలిగినవారు. అట్టి ఆచార్యులు నాకు లభించడం నా భాగ్యం. వీరు నాకు ఉపకారక, ఉత్తారక ఆచార్యులు. వీరు నిష్ఠాగరిష్ఠులు. వీరు సమయపాలన తు.చ తప్పక పాటించేవారు. వీరు తెల్లవారుఝామున 3 గంటల నుండి ప్రాతఃస్మరణతో ఆరంభమై, 8:30కు ఆరాధన పూర్తి అయ్యేది. నిత్యం అంతే. 9 నుంది 12:30 వరకు తిరుమంత్రాది భగవద్విషయ కాలక్షేపములతో జీవనం గడిపారు. ఇతర విషయ ప్రస్తావనే ఉండేది కాదు. "ఆ నిష్ఠానిధి గేహసీమ ..." అన్నట్లు వారి తిరుమాళిగ ఉండేది.

వీరి మనసు చాలా సున్నితమైనది. ఎవరికైనా బాధ కలిగితే "భృశం భవతి దుఃఖితః" అన్నట్లు శ్రీరామచంద్రునిలా దుఃఖపడేవారు. భగవద్విషయాన్ని అనుగ్రహించేటప్పుడు అళ్వార్లు ఆనందపడిన పాశురాలైతే ఆనందపడేవారు, దుఃఖపడే పాశురాలైతే కండ్ల నుండి నీరు కారి, ఆర్తితో ఆళ్వార్ల వలె బాధపడేవారు. పాఠం నడిచేది కాదు.

వారి తిరుముఖమండలాన్ని సేవిస్తూ కాలక్షేపం చేస్తేనే, తెలుస్తుంది ఆనంద పారవశ్యం గాని, దుఃఖ పారవశ్యం గాని. 18 ఆవృత్తులను చేసిన

ఘనత వీరిదే. 125 రోజులలో భగవద్విషయాన్ని పూర్తి చేసిన ఘనత వీరిదే. శ్రీశ్రీశ్రీ దేవనాథ జీయర్ స్వామివారు ఆశ్రమస్వీకారం తీసుకున్న తరువాత, చాతుర్మాస్య సమయంలో శ్రీమాన్ ఉడైయవర్ స్వామివారు శంషాబాద్ శ్రీరామనగరంలో 4 నెలలు ఉండి అనుగ్రహించారు. ఆ ఘనత వీరిదే. ఇలాంటి వైభవం కలిగిన ఆచార్యులు నాకు లభించడం, వారి కోడలుగా అవడం నా అదృష్టం.

వారు తిరుమంత్రార్థం నుండి, ఆచార్య హృదయం వరకు గ్రంథాలను అనుగ్రహించారు. అంతేగాక , ఆళ్వార్లు అనుగ్రహించిన 24 గ్రంథాలలో 10 గ్రంథాలకు వ్యాఖ్యానం అనుగ్రహించారు. 15 ని||ల సమయం ఉన్నా , "ఎదైనా చదువుతావా? " అని అడిగేవారు. అలా నన్ను తీర్చిదిద్దారు. నాచ్చియార్ తిరుమొ[illegible]ి ప్రబంధ వ్యాఖ్యానంలో ప్రాంతీయ నానుడులు ఎక్కువగా ఉండేవి. ఈ వ్యాఖ్యానమును అనుగ్రహిస్తున్నప్పుడు "తెలుగులోకి అనువదిస్తే ముందు తరాలవారికి ఉపయోగ పడుతుంది" అని మా ఆచార్యులు అనుకుంటూ, ఎన్నో ద్రావిడ వ్యాఖ్యాన గ్రంథములకు తెలుగుచేసి ఆంధ్రులకు అందించిన శ్రీమాన్ ఉ. వే. సింగరాచార్య స్వామివారు ఈ నాచ్చియార్ తిరుమొ[illegible]ికి కూడా తెలుగు చేస్తే ఉపయోగపడుతుంది కదా – అని ఫోన్ చేసి వారికి చెప్పేవారు. వారు ఆశించినట్లు ఆ గ్రంథమిప్పుడు ఆచార్య కైంకర్యంగా ముద్రించబడుచున్నది.

ఆచార్య కటాక్షంతో ఆచార్యులద్వారానే ఆన్లైన్ ద్వారా తిరుమంత్రాది భగవద్విషయ గ్రంథ కాలక్షేపములు దాసురాలి ద్వారా

అనుగ్రహిస్తున్నారు. వారి ఆచార్య గోష్ఠిలో శ్రీమతి సీతాదేవి గారు ఒకసారి ఆచార్య కైంకర్యంగా ఏదైనా గ్రంథం వేయిద్దామంటే, అడియేను ఏమి వేయించాలో తెలియట్లేదని అన్నారు. అలా ఒకసారి ఈ విషయం శ్రీమాన్ ఉ.. వే. సింగరాచార్య స్వామివారికి తెలియ పరచగా, సరే అండాళ్ అనుగ్రహించిన నాచ్చియార్ తిరుమొళి వేయిద్దామని అన్నారు. అలా ఈ గ్రంథ ముద్రణ జరిగింది.

శ్రీశ్రీశ్రీ రామచంద్ర జీయరు స్వామివారి కైంకర్యం కలవడం విశేషం. జీయరు స్వాముల మంగళాశాసనములు, డా. టి. కె. చూడామణిగారి మంగళాశాసనములు, తూపురాణి అప్పలాచార్య స్వామివారి మంగళాశాసనములు ప్రార్థించగానే అందడం అడియేన్ భాగ్యం. ఆన్లైన్ గోష్ఠి వారి కైంకర్యములు, ఇంకా భక్తుల పవిత్రద్రవ్యంతో ఈ గ్రంథం ఆచార్య కైంకర్యంగా ముద్రించ బడుతుంది. వీరికి ఆచార్య మంగళాశాసనములు ఎల్లప్పుడూ ఉండాలి. ఈ గ్రంథాన్ని ప్రార్థించగానే అందంగా తయారు చేసి అందించిన శ్రీమాన్ ఉ.. వే. సింగరాచార్య స్వామివారికి అనేక దాసోహములు.

అడియేన్ రామానుజ దాసి

ఉడైయవర్ స్వామివారి శిష్యురాలు, కోడలు,

తూపురాణి పద్మా శ్రీనివాస్

విషయ సూచిక

1వ తనియన్ వ్యాఖ్యానం.....1
2వ తనియన్ వ్యాఖ్యానం.....6
1వ దశకం వ్యాఖ్యానం.....16
2వ దశకం వ్యాఖ్యానం.....63
3వ దశకం వ్యాఖ్యానం.....105
4వ దశకం వ్యాఖ్యానం.....169
5వ దశకం వ్యాఖ్యానం.....210
6వ దశకం వ్యాఖ్యానం.....273
7వ దశకం వ్యాఖ్యానం.....316
8వ దశాకం వ్యాఖ్యానం.....354
9వ దశకం వ్యాఖ్యానం.....412
10వ దశకం వ్యాఖ్యానం.....455
11వ దశకం వ్యాఖ్యానం.....531
12వ దశకం వ్యాఖ్యానం.....592
13వ దశకం వ్యాఖ్యానం.....659
14వ దశకం వ్యాఖ్యానం.....723